

పావనికి వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్



భౌతిక శాస్త్రం పరిశోధకురాలు పావనికి వైవీయూ డాక్టరేట్ ప్రకటించింది. సహ ఆచార్యులు ఎ.అశోక్ కుమార్ పర్యవేక్షణలో 'ఎలక్ట్రికల్, ఆప్టికల్, స్ట్రక్చరల్ అండ్ మోర్ఫలోజికల్ ప్రాపర్టీస్ ఆఫ్ స్ట్రక్చర్స్ ఫర్ ఫోటోడయోడ్ అప్లికేషన్స్' అనే అంశం పై పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని పావని విశ్వవిద్యాలయ పరీక్షలు విభాగానికి సమర్పించారు. వైవీయూ విసి ఆచార్యులు కె. కృష్ణా రెడ్డి మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల బృందం పరిశోధకురాలు రూపొందించిన పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్‌కు అర్హత ఉందంటూ ధృవీకరించారు.

ప్రయివేటీకరణ విధానాలను ప్రతిఘటించాలి

- కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ వామపక్ష కార్మిక, రైతు సంఘాల నిరసన



అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇటీవల కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపేలా ఉందని వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు, లేబర్ కోడ్ల అమలుకు వ్యతిరేకంగా కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్, అన్వేష్, దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్ సంపన్నులకు అనుకూలంగా ఉందని తెలిపారు. సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు వేసే బడ్జెట్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో వ్యవసాయం, ఉపాధి, కార్మికం సంక్షేమానికి కోతలు విధించిందని చెప్పారు. అసంఘటిత రంగ కార్మికులను బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించడంలో బిజెపి ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దారుణమని చెప్పారు. కార్పొరేట్ అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. మద్దతు ధరలు, రుణమాఫీ ప్రస్తావన లేదని తెలిపారు. పంటల బీమాకు నిధులు కేటాయింపు లేకపోవడం రైతులకు నిరాశ పరిచిందని చెప్పారు. అన్ని రంగాలకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయింపు లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమాకు నిధులు కేటాయింపు కోత పెట్టడం, వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి విభజన చట్టంలో చెప్పిన విధంగా నిధులు కేటాయింపు లేకపోవడం అన్యాయమని తెలిపార పిఎం కిసాన్ పంటల బీమాను సవరణ చేసి ఉచిత పంటలు బీమా అమలు చేసి రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జ్ ట్‌లో నిధులు కేటాయింపు లేకపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు రామ్మోహన్, రామకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, మద్దిలేటి, సురేష్, బాదుల్లా, విజయ్, ఉదయ్, రవి, కిరణ్, ప్రకాష్, వేణుగోపాల్ పాల్గొన్నారు. **బద్వేల్ :** ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో పోస్టాఫీసు వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పూర్తిస్థాయిలో కార్పొరేట్‌లు అనుకూలముగా ఉందని పేర్కొన్నారు. బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇరుపోతు ఓబులేసు, పులి శ్యాం ప్రవీణ్, పట్టణ కో - కన్వీనర్ పి.సి.కొండయ్య, పట్టణ నాయకులు సగిలి రాయప్ప, చెప్పలి సుబ్బరాయుడు, దియ్యాల హరి, కాకర్ల బాబయ్య, ముడియం చిన్ని, ఎస్.ప్రవీణ్ కుమార్, గంప సుబ్బారాయుడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రవీణ్‌కుమార్, అశోక్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, ఫోటో-వీడియో గ్రాఫర్స్ యూనియన్ నాయకులు ఎస్.కె మస్తాన్ షరీఫ్, శ్రామిక మహిళ సంఘం పట్టణ నాయకురాళ్లు షేక్ ఖైరూన్ బీ,గంప అనంతమ్మ, రత్తమ్మ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ అన్నారు. బుధవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గమని తెలిపారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌లో కడపలో స్టీల్ ప్లాంట్‌ఏర్పాటు చేయాలని ఉందని గుర్తు చేశారు. బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కు కోసం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు ఎ. వినయ్ కుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మి కుమారి, నిర్మల దేవి,భారతి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మైకేల్, చిట్టిబాబు, శ్రీనివాసులు,నాగేంద్ర, బాష, నాగరాజు, లూక, దివాకర్ పాల్గొన్నారు.

విదేశీ బీమా కంపెనీలు వద్దు

- సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - కడప అర్బన్



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

ప్రపంచ స్థాయి పనితీరు కనబరుస్తున్న ఎల్ఐసి ఉండగా, దేశంలోకి దివాలా తీసిన విదేశీ బీమా కంపెనీలను అనుమతించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించడం బాధ్యతారాహిత్యమని ప్రముఖ సర్జన్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, సిటిజన్స్ ఫోరం కార్యదర్శి లక్ష్మీరాజా, శ్రామిక మహిళా కన్వీనర్ సుబ్బమ్మ, బ్యాంకు ఉద్యోగుల కన్వీనర్ శ్రీనివాసుల రెడ్డి, పెన్షనర్స్ రాష్ట్ర నేత నాగముని రెడ్డి, సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. బుధవారం కడప నాగరాజుపేట డిసిసి బ్యాంకు సమీపంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలకు తగినట్లు పాలసీలు, గొప్ప సేవలు అందిస్తూ, బాధ్యతగా క్లెయిమ్ లు చెల్లిస్తున్న ఎల్ఐసికి పోటీ పడగలిగిన సంస్థ దేశంలో గానీ, ప్రపంచంలో గానీ ఏదైనా ఉందా అని వారు నిలదీశారు. పాలసీదారుల ప్రయోజనాల కోసం జిఎస్‌టి తొలగించాలని, జీవిత బీమా ప్రీమియాలకు ప్రత్యేక పన్ను రాయితీ ఇవ్వాలని, ఎల్ఐసి సంస్థకు స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 400 మంది పార్లమెంట్ సభ్యులు సిఫారసు చేస్తే ప్రభుత్వం పట్టించు కోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అవధానం శ్రీనివాస్, అక్బర్ బాషా, వసుప్రద, రామాంజనేయులు, సుధీకర్, శ్రీనివాసులు, నిత్యానంద రెడ్డి, శివారెడ్డి (ఇన్సూరెన్స్) శ్రీనివాసులు రెడ్డి, అజీజ్, జగదీష్ (బ్యాంకింగ్), మహేష్ (యుటిఎఫ్), సుబ్బారెడ్డి (పోస్టల్), రామకృష్ణారెడ్డి (పెన్షనర్స్) సుబ్బారావు, సుధాకర్ (టెలికం), రామానుజుల రెడ్డి (మెడికల్ రిప్స్), సుబ్బమ్మ (శ్రామిక మహిళ), లక్ష్మీదేవి (అంగన్వాడి), రాహుల్, సరస్వతి, శ్రీనివాసుల రెడ్డి (జెవివి) పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

వివిధ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పిజిఆర్ఎస్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా వెనుకబడిన వర్గాల వారికి అందిస్తున్న స్వయం ఉపాధి రుణ సహాయ సంక్షేమ పథకాల అమలు పై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆయా కార్పొరేషన్ల జిల్లా అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు హాజయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బిసి కార్పొరేషన్, బిసి జనరిక్ మెడికల్ షాపులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కార్పొరేషన్, ఇడబ్ల్యూ ఎస్ జనరేకల్ జనరిక్ మెడికల్ షాపులు, కాపు చంద్రన్న స్వయం ఉపాధి వంటి వాటిని పొందేందుకు అర్హులైన వారిని గుర్తించాలని ఎంపిడిఒలు, కమిషనర్లకు సూచించారు. ఎపిఒబి ఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా ప్రకటిస్తామన్నారు. గ్రామాల్లో మండలాల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు పథకాలకు అర్హులని అన్నారు. ఆయా శాఖల కార్పొరేషన్లకు సంబంధించి అర్హత వయస్సును నిర్ధారిస్తారన్నారు. రుణ సహాయాన్ని పొందడానికి బ్యాంకుల నిర్ధారించిన నిబంధనలను పాటించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారక వేదికలో ఇచ్చిన అర్జీ దారుని ఇంటికి వెళ్లి, అర్జీదారులతో సెల్ఫీ దిగి సమస్యను నిశితంగా పరిశీలించి పరిష్కార మార్గం అందించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషా రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ హెచ్ వెంకట సుబ్బయ్య, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, బిసి కార్పొరేషన్ ఇడి జయసింహ, కడప కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, డిఎల్‌డిఒ సుబ్రమణ్యం, ఎల్‌డిఎం జనార్దనం, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ,అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి చిరుత బలి

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - సింహాద్రిపురం/లింగాల



మృతి చెందిన చిరుత

పులివెందుల నియోజక వర్గంలోని లింగాల, సింహాద్రిపురం మండల సరిహద్దు గ్రామమైన రామాపురంలో విద్యుదాఘాతానికి మగ చిరుతపులి మృతి చెందింది. వివరాలు.. లింగాల మండలం రామాపురానికి చెందిన భరత్ కుమార్ రెడ్డి అనే రైతు తోటలో అడవి పందుల బారి నుండి పంటను రక్షించుకోవడానికి విద్యుత్ తీగలను అమర్చారు. ప్రమాదవశాత్తు చిరుత పులి విద్యుత్ తీగలకు తగులుకొని షాక్ కొట్టి బలైపోయింది. **ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన..** నియోజకవర్గంలోని లింగాల మండలం రామాపురంలో చిరుత పులి మృతి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దాదాపు ఐదు రోజుల కిందట విద్యుత్ తీగలకు తగులుకొని చిరుత అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతు సమీపంలోని గుట్టలో గుంతతీసి పాతిపెట్టారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా ఫోటోలు వైరల్ కావడంతో ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముందుగా రైతును గుర్తించి విచారించి చిరుతపులి పూడ్చిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం చిరుత పులిపూడ్చిన ప్రదేశానికి వెళ్లి గోతి తీసి పూడ్చిపెట్టిన చిరుతను బయటకు తీశారు. అనంతరం చిరుతకు పోస్టుమార్టం చేశారు. **వన్య ప్రాణులు చంపడం నేరం..** వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద చిరుతపులిని చంపడం చట్టరీత్యా నేరమని ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం చిరుత మృతికి సంబంధించిన సంఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం మీడియాతో మాట్లాడారు. తమకు అందిన సమాచారం మేరకు రామాపురానికి వెళ్లి సంబంధిత రైతును విచారించామని చెప్పారు. రైతు పొలంలోని విద్యుత్ తీగలు తగలడం కారణంగా చిరుత మృతి చెందిందని విచారణలో వెల్లడైందన్నారు. దీంతో పూడ్చిన స్థలానికి వెళ్లి పరిశీలించగా అక్కడ చిరుత మృతదేహం కనిపించింది అన్నారు. తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించగా ప్రశ్నిస్తే అటవీ శాఖ వారికి సమాచారం తెలియజేయాల్సిన విషయం తెలియదని చెప్పారన్నారు. రైతును వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద అరెస్ట్ చేస్తామని డిఆర్ఒ తెలిపారు.

అవగాహనతోనే వారసత్వ సంపదకు రక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నేటితరం బాలలకు వారసత్వ సంపద విలువ పట్ల అవగాహన కల్పిస్తేనే దాన్ని రక్షించుకోవచ్చుని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ విసి డాక్టర్ విశ్వనాథ్‌కుమార్ అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో నగరానికి చెందిన విద్యార్థులకు సెలబ్రేటింగ్ ఇండియా పేరిట పోస్టర్ తయారీ పోటీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతో అపురూపమైన వారసత్వ సంపద ఉందని, అందులో మన దేశం ఏమాత్రం తక్కువ కాదని, ప్రధానంగా రాయలసీమలో కూడా ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందన్నారు. ముఖ్యంగా దీని గురించి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆ సంపదను రక్షించుకోవాల్సిన అవసరం గురించి తెలుస్తుందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ వ్యయ ప్రయాసలు కోర్చి సంస్థ ఆధ్వర్యంలో మన చరిత వారసత్వ బులిటిన్‌ను ప్రతినెల ప్రచురిస్తున్నామని, ఈ ప్రాంత వారసత్వ సంపద గురించి ప్రచారం చేసేందుకు, రక్షించేందుకు ఇది ఎంతో తోడ్పడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ సేవలు వెలకట్టలేనివని, ఎంతో విలువైన వారసత్వ సంపద రక్షణకు జిల్లా చాప్టర్ చేస్తున్న కృషి ఎన్నదగిందని చెప్పారు. అన్నమయ్య జిల్లా లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, ఎస్‌సి సంక్షేమశాఖ ఉప సంచాలకులు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పాల్గొన్నారు. నగరానికి చెందిన 119 మంది విద్యార్థులు పోస్టల్ డిజైనింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఇంటాక్ సభ్యులు

వెల్లటూరులో జర్మన్ బృందం పర్యటన

ప్రజాశక్తి - కడప అర్బన్

జర్మన్‌కు చెందిన జాతీయ బ్యాంక్ కెఫ్‌డబ్ల్యూ ప్రతినిధి బృందం బుధవారం జిల్లాలోని పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలనలో భాగంగా ఈ నెల 3 నుంచి 7 వరకు చేస్తున్న పర్యటనలో భాగంగా వెల్లటూరులో మెంటార్, ఇంటర్న్ రైతు హరిప్రియ పొలంలోని ఐజిజిఎఆర్ఎల సెంటర్ ప్రయోగాత్మక ప్లాట్‌ను సందర్శించారు. మార్క్ ప్రీస్, అన్నా బెరెజోవ్‌స్కాజా, సంగీత అగర్వాల్, సేర్వి నాబూర్స్ ఈ బృందంలో ఉన్నారు. బృంద సభ్యులు హరిప్రియ పొలంలో విత్తన గుళికల విధానాన్ని ఉపయోగించి వేసిన అలసంద ప్రయోగాత్మక ప్లాట్‌ను పరిశీలించారు. ప్రయోజనాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు విత్తన గుళికల తయారీ విధానాన్ని డెమో పద్ధతిలో ప్రత్యక్షంగా ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. విత్తన గుళికల విధానం వల్ల విత్తనాలు 6 నెలల వరకు జీవంతో ఉండి, తక్కువ తేమలో (కనీసం 10-15 మి.మీ.) కూడా మొలకెత్తే సామర్థ్యం పెరుగుతుందని, అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం, వ్యాధి-పురుగు నిరోధకతకు విత్తన గుళికలు ఎంతో తోడ్పడతాయని రైతులు బృంద సభ్యులకు వివరించారు. ఈ బృందం గంగిరెడ్డిపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం ద్వారా రైతులకు అందుతున్న సేవలను, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహానికి తీసుకొంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు, జి. మురళీధర్, అకాడమీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివారెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్, అదనపు డీపీఎం వసంత కుమారి, థిమాటిక్ లీడ్ లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి : జెసి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలో లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని జెసి అదితి సింగ్ పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఉన్న పౌరసరఫరాల శాఖ గోడౌన్‌ను తనిఖీ చేశారు. అనంతరం తహశీల్దార్ హరినాథ్ రెడ్డి, సివిల్ సప్లయ్ ఎన్ ఫోర్త్ మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌లతో కలిసి స్టాకు వివరాలను పరిశీలించారు. సంబంధిత వివరాలను గోడన్ డిటి శివశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని అందించే ఎండియు ఆపరేటర్లకు తూకాలు సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అందించే రేషన్‌ను డీలర్లు, ఎండియు ఆపరేటర్లు తూకాలు తక్కువ ఇస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. గోడౌన్ల నుంచి డీలర్లు తూకాలు వేసుకొని వెళ్లాలని సూచించారు. మరోసారి సక్రమంగా తూకాలు ఇవ్వకపోతే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం చింతలమడుగుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, ప్రభుత్వం ద్వారా అందుతున్న బియ్యం సక్రమంగా సరఫరా అవుతుందా లేదా అని హెచ్‌ఎం మస్తాన్ వలిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కత్తులూరు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద భూమి రీ -సర్వే చేస్తున్న క్రమంలో జెసి పరిశీలించి గ్రామీణ ప్రాంతాల్లో రైతుల మధ్య గలాటాలు పడకుండా సక్రమంగా సర్వే నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులు రీ సర్వేకు వెళ్లే ముందు రైతులకు కూడా సమాచారం ఇవ్వాలన్నారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లోకేష్, విఆర్ఒలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రవీంద్రనగర్‌లో నివాసముంటున్న పేద విద్యార్థి చదువుకు సీనియర్ ఆడిటర్ లయన్ పఠాన్ ఖాసింఖాన్ ఆర్థిక సాయం చేశారు. లక్ష్మీదేవి అనే మహిళ టైలరింగ్ చేసుకుంటూ ఇద్దరు కుమారులు యుగంధర్ రెడ్డి, రాజేష్ రెడ్డిని చదివించుకుంటున్నారు. వీరి పరిస్థితి తెలుసుకున్న లయన్ పఠాన్ ఖాసింఖాన్ సిఎ కోర్సు నిమిత్తం ప్రతి ఏడాది అయ్యే ఖర్చు రూ.20 వేలు మూడు సంవత్సరాలకు రూ.60 వేలు ఆర్థిక సహాయం అందించేందుకు వాగ్దానం చేశారు. ఇప్పటివరకు రూ.40 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఖాసింఖాన్ మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది ధనికులు ఉన్నారని, ఇలాంటి పేద విద్యార్థులను ఆదరించి ప్రోత్సహిస్తే గొప్పవారవుతారని పేర్కొన్నారు. తల్లి కష్టాన్ని, పిల్లల కృషిని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక సాయం చేయాలని కోరారు.



ఆర్థిక సాయం చేస్తున్న లయన్ పి. ఖాసింఖాన్

'నల్సా'పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప : నల్సా పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో నల్సా పథకాలపై న్యాయ సేవల సభ్యులకు సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పథకాలను వివరించారు. బాలల సంరక్షణ కోస స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం -2024, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, సపోర్ట్ పర్సన్స్ గార్డియన్, వార్డ్ యాక్ట్, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006, బాల్య న్యాయ చట్టం 2015, ఉచిత నిర్బంధ విద్య కోసం పిల్లల హక్కు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్ ట్రాంజెండర్ అండ్ సీనియర్ సిటిజన్ కృష్ణ కిషోర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, కడప, ప్రొద్దుటూరు డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ అధికారి రమేష్, ప్రోగ్రాం మేనేజర్ నవీన్ కుమార్, కడప డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

5 శాతం రిజర్వేషన్ ఇవ్వకపోతే నిరవధిక దీక్ష

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న రాము

బలిజ కుల స్తులకు రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్ ఇవ్వకపోతే నిరవధిక నిరాహార దీక్షకు కూర్చుంటానని రాయలసీమ బలిజ సంక్షేమ ఐక్య పోరాట సమితి అధ్యక్షులు సమతం రాము పేర్కొన్నారు. బుధ వారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 లోపు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. దశాబ్దాల కాలంగా రాయలసీమలో బలిజలకు అన్యాయం చేస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజలను బిసిలలో చేర్చాలని వైఎస్ఆర్ ప్రయత్నం చేశారని తెలిపారు. కొంతమంది కాపులు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో తరువాత అది ఆటకెక్కిందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు కూడా ఏమీ చేయలేదని చెప్పారు. బలిజలు చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకం కాదని తెలిపారు. 5 శాతం రిజర్వేషన్ ఇస్తామన్నప్పుడు పాలాభిషేకం చేశామని చెప్పారు. కానీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ బలిజలకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. రాయలసీమలో నేతలు బలిజలను అణగదొక్కుతున్నారని తెలిపారు. సమావేశంలో కాపు నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన బిసి సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-కడప సిటీ



ఎస్‌పికి కేలండర్ అందజేస్తున్న నాయకులు

ఇటీవల ఎస్పిగా బాధ్యతలు చేపట్టిన ఇ.జి. అశోక్ కుమార్‌ను జిల్లా బిసి సంక్షేమ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పిని బిసి భవన్‌ను సందర్శించాలని సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు సాదరంగా ఆహ్వా నించారు. కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా గతంలో ప్రజలకు మంచి సేవలు అందించారని, మళ్లీ ఎస్పిగా జిల్లాకు రావడం తమకు చాలా సంతో షంగా ఉందన్నారు. బిసి హక్కుల పరిరక్షణలో సహకారం అందిస్తారనే ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. ఎస్పిని కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు పస్తం అంజి, కోశాధికారి శ్రీనివాసులు, సిఆర్ఐ సునీల్ జయంత్, సుంకేసుల ఖాదర్ బాషా, మునిరత్నం గౌడ్, రంగయ్య ఉన్నారు.

అర్హులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బిసి, ఒబిసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం వందలాది మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారని వీటిలో పారదర్శకంగా, ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువత కొనేళ్లుగా ప్రభుత్వం నుంచి రుణాల మంజూరు కోసం ఎదురు చూస్తూ ఉన్నారని చెప్పారు. గతంలో పేరుకు మాత్రమే కార్పొరేషన్లు ఉండేవని గడిచిన ఐదేళ్లల్లో ఒక్క కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు మంజూరు చేసింది లేదన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో బిసి, ఒబిసిలకు కార్పొరేషన్ ద్వారా బ్యాంక్ అనుసంధానంగా రుణాల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే రుణాల కోసం వేలల్లో దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం నోటిఫికేషన్లు లేవని, ఉద్యోగాల భర్తీ ఇప్పట్లో లేవని, కనీసం రుణాలు మంజూరు చేస్తే వాటితో యువత చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటారన్నారు. రుణాల మంజూరులో రాజకీయ జోక్యం నివారించాలని తెలిపారు. అధికారులు పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అందరికీ రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

22న 'ఉయ్యాలవాడ' వర్ధంతి సభ

ప్రజాశక్తి - కడప అర్బన్ : తొలి స్వాతంత్ర్య యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు కడప ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నామని జానమద్ది సాహితీపీఠం అధ్యక్షులు జానమద్ది విజయభాస్కర్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డిముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపి రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, సిహెచ్‌ఆర్‌డి శివారెడ్డి పాల్గొన్నారు.

కెఎస్‌హెచ్‌లో చిన్నారికి అరుదైన వైద్యం

కడపలో వేలూరు ఆస్పత్రి తరహా ఆధునిక వైద్య సేవలు

కెఎస్‌హెచ్ న్యూబోర్న్ ఆస్పత్రి ప్రధాన వైద్యులు కె.సద్దాంహుసేన్

ప్రజాశక్తి-కడప సిటీ



ఆపరేషన్‌చేస్తున్న కె. సద్దాంహుసేన్

ఒంటిమిట్ట మండలం తప్పిటవారిపల్లికి చెందిన మల్లికార్జున, దీపిక దంపతులకు చెందిన పురిటిబిడ్డకు అరుదైన వైద్యసేవలు అందించామని కెఎస్‌హెచ్ చిన్నపిల్లల ఆస్పత్రి వైద్యనిపుణులు కె.సద్ధాంహుసేన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కెఎస్‌హెచ్ ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడుతూ 50 రోజుల కిందట 'బైలేటర్ ఓకల్ కార్డ్ పాలసీ' అనే అరుదైన వ్యాధితో ఆస్పత్రికి వచ్చారన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడని తెలిపారు. పురిటి బిడ్డ ఆరోగ్య పరిస్థితిని గమనించిన వెంటనే వ్యాధి నిర్ధారణ చేసి, చికిత్స అందించామని చెప్పారు. అనంతరం 21 రోజులపాటు వెంటిలేటర్‌పై వైద్య సేవలు అందించామన్నారు. సాధారణంగా ఇటువంటి అరుదైన వ్యాధులకు హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, ఏలూరు వంటి ఆస్పత్రుల్లో ఆధునిక వైద్యసేవలు అందిస్తారన్నారు. తాజాగా ఇటువంటి అరుదైన వ్యాధులకు కెఎస్‌హెచ్ న్యూబోర్న్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నాణ్య మైన వైద్యసేవలు అందించామన్నారు. దీంతో చిన్నారి నాలుగు కిలోల బరువు పెరుగుదలతోపాటు ఆరోగ్య పరిస్థితి పూర్తిస్థాయిలో మెరుగుపరిచామని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం చిన్నారిని డిశ్చార్జి చేశామని వెల్లడించారు. సమావేశంలో ఆయనతోపాటు ఆయన సతీమణి చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.సుమియా, నర్సులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

జంతు పక్షోత్సవాల్లో 'ఉషాకిరణ్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె


విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రమణారెడ్డి

జంతు సంక్షేమ పక్షోత్సవాల పోటీల్లో ఉషా కిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థి పి.వి ఉషాకు మొదటి బహుమతి వచ్చినట్లు కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలను పురస్కరించుకుని కడప జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వేంపల్లెలో మండల స్థాయి వ్యాస రచన పోటీలను ఆయా పాఠశాలల విద్యార్థులకు ఏర్పాటు చేశారు. ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఉష వ్యాస రచన పోటీల్లో తన ప్రతిభను చూపడంతో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో పివి ఉషాను పులివెందుల పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ మంగేశ్వరరావు ప్రశంస పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మొదటి స్థానంలో రాణించడం సంతోషకరమని పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్, సహాయ సంచాలకులు డాక్టర్ సి. రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ ఎం. సాధిక్‌బాషా, జంతు సంక్షేమ సంఘం సభ్యులు గోవర్ధన్, సుమన్ పాల్గొన్నారు.

లార్వా నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో లార్వా నాశనం చేసేందుకు గంబుజియా చేపలు వదిలినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మయ్య తెలిపారు. స్థానిక ఎస్.వి. గిరి కాలనీ సమీపంలో ఉన్న పెద్ద కాలువలో బుధవారం లక్ష్మయ్య ఆధ్వర్యంలో గంబుజియా చేపలు వదిలారు. ఆయన మాట్లాడుతూ మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో లార్వా నాశనానికి గంబుజియా చేపలు వదిలామని, గంబుజియా చేపలు లార్వాను తినడం వల్ల మలేరియా, డెంగీ, చిక్కున్ గున్యా లాంటి జబ్బులు దరి చేరవని చెప్పారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, సిబ్బంది పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** ప్రజల ఆరోగ్యంపై దోమలు దాడిచేసి మలేరియా డెంగీ చికెన్ గున్యా లాంటి జబ్బులను వ్యాప్తి చేస్తాయని, వాటిని లార్వా దశలోని నియంత్రించాలని కామనూరు వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా, మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళీధర్ అన్నారు. దోమల నివారణ కోసం బుధవారం ప్రొద్దుటూరు మండల పరిధిలోని అమృత నగర్, చెన్నమరాజుపల్లె, కామనూరు, గోపవరం,నరసింహపురం, కాకిరేణి పల్లెలలో ఉన్న కుంటలు, కోనేరులలో దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నిర్మూలించుటకు నీటిలో గంబూజియా చేపలను వదిలారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్స్ బి.ఎ. వర ప్రసాద్, మాధవ రెడ్డి,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిహెచ్ఒ మెర్సీ, ఆరోగ్య కార్యకర్త యశోద, ఆశా కార్యకర్తలు బిందు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై మంత్రికి ఫిర్యాదు

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక సబ్ రిజిస్ట్రార్‌పై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు టిడిపి నేత ఎద్దుల శేషారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుదుముల నారాయణరెడ్డి అనే వ్యక్తి బోమ్మేపల్లె లీలావతి అనే అమెకు డబ్బులు ఇచ్చారని, అ డబ్బులు తిరిగి ఇవ్వక పోవడంతో నారాయణరెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారని చెప్పారు. డబ్బులు ఇచ్చే వరకు బోమ్మేపల్లె లీలావతికి సంబంధించిన ఆస్తులను విక్రయించరాదని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. వేంపల్లె ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ ఈశ్వరయ్య కోర్టు ఆదేశాలను ధిక్కరించి బోమ్మేపల్లె లీలావతి అనే ఆమె ఇతరులకు భూములు విక్రయించారన్నారు భూములకు సంబంధించిన వేంపల్లె ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ ఈశ్వరయ్య రిజిస్ట్రేషన్ చేశారని మంత్రికి పిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా భూములను రిజిస్ట్రేషన్ చేసిన ఇన్‌ఛార్జ్ సబ్ రిజిస్ట్రార్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రధాని వ్యాఖ్యలు గర్హనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని ప్రధాని నరేంద్ర మోడీ అర్బన్ నక్సల్స్ అని వ్యాఖ్యానించడం గర్హనీయం, పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత, సార్వ భౌమత్వం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఆత్మ బలిదానం చేశారని చెప్పారు. అటువంటి కుటుంబానికి చెందిన నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. దేశానికి కాంగ్రెస్ ఏమీ చేయలేదని, అంతా తానే చేసానని మోడీ సొంత డబ్బా కొట్టుకోవడం హాస్యాస్పదం అన్నారు. బిజెపి పుట్టక ముందే భాక్రా నంగల్, నాగార్జున సాగర్ లాంటి భారీ సాగునీటి ప్రాజెక్టులను, దుర్గాపూర్, భిలాయ్, రూర్కెలా లాంటి ఉక్కు కర్మాగారాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించాయని గుర్తు చేశారు. ఆకాశం మీద ఉమ్మి వేస్తే అది తిరిగి తమ ముఖం మీదనే పడుతుంది అన్న నగ్న సత్యాన్ని మోడీ, బిజెపి నాయకులు గ్రహిస్తే మంచిదని సూచించారు.

బ్రాహ్మణులకు పథకాల్లో లబ్ధి చేకూర్చాలి

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో బ్రాహ్మణులకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు కోరారు. జిల్లా ఇన్ ఇన్‌ఛార్జి మంత్రి సవితనుకలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా బ్రాహ్మణులకు తక్కువగా లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరించాలని కోరారు. ముందు గరుడ పథకాన్ని వెంటనే అమలు చేసి బ్రాహ్మణులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే దాదాపు 100 మంది పైగా బ్రాహ్మణులు గరుడ పథకానికి దరఖాస్తులు చేసుకుని ఉన్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఈ పథకం కింద ఎవరికీ సహాయం అందించలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. కాబట్టి కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పథకం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు ఇటుకులపాటి భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో ఘనంగా రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో 108 సూర్య నమస్కారాలతో ఘనంగా రెండు రోజుల పాటు రథసప్తమి వేడుకలను విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించారు. మాఘ మాసంలో వచ్చే శుక్ల పక్ష సప్తమిని ప్రతి ఎడాది రథసప్తమిగా నిర్వహించుకుంటారని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. సూర్యుడు దక్షిణాయణం నుండి ఉత్తరాయణంలోకి ప్రవేశించే సమయంలో ప్రకృతిలో చాలా మార్పులు వస్తాయని చెప్పారు. ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే సూర్య నమస్కారాలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. జీవితంలో వచ్చే కష్టాలను, సుఖాలను అధిగమించాలని కోరారు. కార్యక్రమంలో యోగా గురువు లక్ష్మి భారతి, డీన్ ఆకాడమిక్ రమేష్ కైలాష్, డిఎస్ డబ్ల్యు కోటేశ్వరి, అశోక్, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- వల్లూరు : కడప-తాడిపత్రి జాతీయ రహదారి రామిరెడ్డి కొట్టాలు వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని చందు (18) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు.. తోళ్ళగంగనపల్లె నుంచి సాటి లైట్ సిటీ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం కడప నుంచి కమలాపురం వెళుతున్న మరో ద్విచక్ర వాహనాలు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. కమలాపురం వైపు వస్తున్న యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడు కమలాపురం గ్రామానికి చెందిన చందుగా పోలీసులు గుర్తించారు. ఆధార్ పనినిమిత్తం కడపకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో సంఘటన చోటుచేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ : రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన దొంగతనం కేసులో ముద్దాయిలను అరెస్టు చేసి, బంగారం, నగదు రికవరీ చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ద్వారకా నగర్‌కు చెందిన సగలాల నాగరాజు, శ్రీనివాసపురంకు చెందిన గెడ్డం శివశంకర్, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దసా వినోద్, ద్వారకా నగర్‌లో నివాసమున్న సగటాల రమణయ్య ఇళ్లలో తాళం పగులగొట్టి బంగారు వస్తువులను, డబ్బులను చోరీ చేశాడని పేర్కొన్నారు. ముగ్గురు దొంగలను టివిఆర్ పెట్రోల్ బంకు వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 31.97 గ్రాముల బంగారం, రూ.44,500 నగదు రికవరీ చేసినట్లు వివరించారు.

నర్సరీలపై కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి - చాపాడు


జివి సత్రం వద్ద అందుబాటులో ఉన్న కూరగాయల నర్సరీ

నియోజకవర్గ పరిధిలో అనుమతులు లేని నర్సరీలు రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్నాయి. మైదుకూరు, చాపాడు, దువ్వూరు, బి.మఠం, ఖాజీపేట మండల పరిధిలో కుందూ, బ్రహ్మసాగర్ బోరుబావులు, చెరువుల కింద కూరగాయల సాగుకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదే అదనుగా చేసుకుని కొంతమంది ప్రభుత్వ అనుమతి లేకుండా నర్సరీలు ఏర్పాటు చేసి కూరగాయల మొక్కలను రైతులకు అమ్మకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా విత్తనాలను సేకరించి సరైన ప్రమాణాలు పాటించకుండా నర్సరీ పెంపకం చేపడుతున్నారు. దీంతో సరైన దిగుబడులు రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. నర్సరీ ఏర్పాటు చేసే సమయంలో అనుమతి తీసుకుంటే నాణ్యమైన విత్తనాలు సాగు చేసి మేలురకం మొక్కలను రైతులకు ఇవ్వడమే కాకుండా రసీదులు తప్పక ఇస్తారు. నర్సరీలకు అనుమతులు లేకపోవడంతో రైతులకు రశీదులు ఇవ్వడంలేదు. పంటలు దిగుబడి సరిగా రాకపోయినప్పటికీ రైతులు నర్సరీ యజమానులను ప్రశ్నించ లేని పరిస్థితుల్లో ఉన్నారు. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది . మైదుకూరు ప్రాంతం నుండి ఇతర నియోజకవర్గాలకు, జిల్లాలకు కూడా నర్సరీల నుంచి రైతులు మొక్కలు సేకరించుకొని తీసుకు వెళుతున్నారు. ముఖ్యంగా మిరప, టమోటా, చిక్కుడు అనప, బీర తదితర కూరగాయల రకాలను సాగు చేస్తూ రైతులు నష్టాల బారిన పడుతున్నారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా 150 నర్సరీ వరకు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు వద్ద కేవలం 10లోపు మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలుస్తున్నది. అక్రమంగా వందలాది నర్సరీలు ఏర్పడి కూరగాయలు సాగు చేసే రైతులను నట్టేట ముంచుతున్నారు .ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి అనుమతుల్లేని నర్సరీలను తొలగించే ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాల నిల్వలపై జాగ్రత్తలు తప్పనిసరి



సింహాద్రిపురం : రైతులకు నూర్పిడిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతులు విత్తనాల నిల్వలపై సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వై.కొత్తపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం శనగ పంట నూర్పిడి చేస్తున్నారని పేర్కొన్నారు. నూర్పిడి అనంతరం విత్తనాలలో అధిక తేమ శాతం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. నిల్వ ఉంచాలనే రైతులు వాటి పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో బుడ్డ శనగ దిగుబడులు గణనీయంగా తగ్గినట్లు ఏవో దృష్టికి రైతులు తీసుకొచ్చారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో తుపాన్ ప్రభావంతో శనగ దిగుబడి తగ్గిందని, ఇన్సూరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎఒ వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రత్యూష,శిరీష, దీపిక, ఉష పాల్గొన్నారు. **గోపవరం :** మండలంలోని సంద్రపల్లిలో బుధవారం ఇన్‌ఛార్జి ఎఒ మాధురి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎఒ మాధురి మాట్లాడుతూ గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వివరాంచాలన్నారు. గ్రామములో సాగు చేస్తున్న వేరుశనగ, వరి, కూరగాయలు, పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్య రక్షణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు కె. బాదుల్లా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సునంద, రైతులు పాల్గొన్నారు. **వేముల :** శనగ పంట కోత ప్రయోగాలు మండలంలోని వేముల రెవెన్యూ గ్రామంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధుల సమక్షంలో ఎఒ వి. చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వేముల రెవెన్యూ గ్రామంలో శనగ పంటలో నాలుగు చోట్ల పంట కోత ప్రయోగాలను ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు విష్ణు వర్ధన్, పవన్ సమక్షంలో నిర్వహించి దిగుబడిని అంచనా వేశామన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు విష్ణువర్ధన్, పవన్, విహెచ్ఎ హారిక, ఎంపిడిఒలు నందిని, ఎలీషా, విఆర్ఎ రమణయ్య, రైతులు పాల్గొన్నారు. **చాపాడు :** రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు తప్పకుండా ఇ-పంట నమోదు చేసుకుని ఈనెల 25లోగా ఇకెవైసి పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మిపేటలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో నూగు, మినుము, జొన్న, దోస వంటి పంటలను సాగు చేపడుతున్నారన్నారు. సాగుచేసిన పంటలకు ఇ-పంటలో నమోదు చేసుకొని ఇకెవైసి చేయించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని తెలిపారు. రబీ పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఎఎలు సుప్రియ, లత రైతులు పాల్గొన్నారు. **లింగాల :** రబీలో సాగుచేసిన వేరుశనగ పంటలో రైతులు సస్యరక్షణలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ అన్నారు. ఈ మేరకు ఆయన మండల పరిధిలోని గుణకనపల్లెలో శుక్రవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఆయన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు పసుపు, అట్టలు మార్చడం వల్ల తెల్ల దోమ ,పచ్చ దోమ నివారించుకోవచ్చు అన్నారు. అలాగే 45 రోజుల పంట దశలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేసుకోవాలి అన్నారు. దీని వల్ల నూనె శాతం పెరిగి దిగుబడి పెరుగుతుందని ఆయన రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది గోపి, గ్రామ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు


సమీక్ష సమావేశంలో చర్చిస్తున్న అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - వేముల

మహిళా రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక శ్రీ శక్తి భవన్‌లో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .ఆసక్తి కలిగిన మహిళా రైతులను కనీసం 12 మంది నుంచి 17 మందికి మించకుండా ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రైతు సంఘాలకు సాంకేతిక శిక్షణలు, వ్యవసాయం అధారిత జీవనోపాదుల మెరుగుదలకు కావాల్సిన సూచనలు, పండిన పంటలకు గిట్టుబాటు ధర సంఘం తరపున కృషి చేయాలన్నారు. మండలంలో మహిళల సంరక్షణ కోసం గ్రామ సమాఖ్య సోషల్ యాక్షన్ కమిటీలు, మండల మహిళా సమాఖ్య సోషల్ యాక్షన్ కమిటీలు జెండర్ రిసోర్స్ సెంటర్‌తో అనుసంధానంగా పనిచేస్తాయని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం పైన మహిళా సంఘం సభ్యులకు అవగాహన కల్పించి సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకున్న దానికి ముందుకు వచ్చే డ్వాక్రా మహిళలను గుర్తించాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ నిర్వహిస్తున్నటువంటి స్వయం సహాయక సంఘ సభ్యులకు పిఎంఎఫ్ఎంఇ రుణాలు అందజేయాలని కోరారు. శ్రీనిధి మేనేజర్ సాయి తేజ మాట్లాడుతూ శ్రీనిధి పొదుపులు, రుణాలు వందశాతం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు జ్యోతి జైపాల్, హరికృష్ణ, నాగేశ్వరి, గంగరాజు మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ చిన్నరెడ్డి పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశానికి చట్టబద్ధత

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

గత నెల 31న నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి చట్టబద్ధత ఉందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ ముక్తియార్ అన్నారు. బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 31న ముందుగ చైర్మన్ ప్రకటించిన విధంగానే కౌన్సిల్ కోరం ఉండడంతో సమావేశాన్ని నిర్వహించాం అన్నారు. సమావేశానికి చట్టబద్ధత ఉందన్నారు. గత నెల 31న బడ్జెట్ సమావేశం అనంతరం సాధారణ సమావేశం నిర్వహించాలని అంటున్నప్పటికీ సమాధానం చెప్పకుండ దురుసుగా ఛైర్‌పర్సన్ వెళ్లిపోవడంతో ప్రజాపక్షాన నిలబడి ఎంఎల్‌ఎ ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించారన్నారు. అజెండాలో అంశాలు పొందుపరిచే సమయంలో తెలియదా అని ప్రశ్నించారు. అజెండా తయారు చేసేది వారే, వాయిదాలు వేసేది వారే.. అంతా వైసిపి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు వాయిదాలతో కాలయాపన, బ్లాక్‌మెయిలింగ్‌తో పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని ముక్తియార్ హితవు పలికారు.

నేడు నక్కలదిన్నెలో విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ సమేత హనుమత్ విగ్రహ శిఖర ప్రజా ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమాలు గురువారం ప్రారంభమై శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన గ్రామోత్సవంతో పూర్తవుతాయన్నారు. శనివారం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పిల్లల శారీరక ఎదుగుదలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పిల్లల శారీరక ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టి వారికి పౌష్టికాహారం అందివ్వాలని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఇసిసిఇడేను నిర్వహించారు. అంగన్వాడీలో చదివే విద్యార్థుల ఎత్తును కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల 5న ఇసిసిఇడేను ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించాలన్నారు. తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై, ఇతర వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. బిడ్డకు 6 ఏళ్ల వయస్సు వచ్చేసరికి మెదడు 90 శాతం వరకు అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆ సమయంలో బిడ్డ శారీరక ఎదుగుదల చాలా ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు. 0 నుంచి 6 సంవత్సరాలు వయస్సు గల పిల్లల దశను బాల్యారంభ దశగా గుర్తిస్తారని చెప్పారు. ఈ దశలో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ అనేది ప్రతినెలా బరువు, ఎత్తును తీయడం ద్వారా తెలుస్తుందని చెప్పారు. బరువు, ఎత్తులను కొలతలు వేయడం వల్ల పిల్లలలో అభివృద్ధి దశ ఎంత వరకు ఉన్నది తెలియడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తెలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్త శైలజా, అంగన్వాడీ, సహాయకురాలు శిరీష, ఆశా కార్యకర్త స్వరూప, తల్లులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని శాసనమండలి సభ్యుడు రాంగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు ప్రజలు వారి సమస్యలను తెలియజేశారు. సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వారి గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను గురించి ఆయన తీసుకువెళ్లారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరెడ్డి

ఎలాంటి అవాంఛనీయ
ఘటనలు చోటు చేసుకోలేదు

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులోని రిపబ్లిక్ క్లబ్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని కూటమి మండల అధ్యక్షులు యూత్ సింగం నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్మలమడుగు రిపబ్లిక్ క్లబ్ 1955లో స్థాపించారని చెప్పారు. ఆర్‌డిఒ, డిఎస్‌పి, ఎమ్మెల్యేలు గతంలోమెంబర్స్‌గా ఉంటూ చెస్, క్యారం బోర్డు, టెన్నిస్ ఇతరత్ర గేమ్స్ నిర్వహించారన్నారు. ఎంపీ సి.ఎం. రమేష్ నాయుడు ఆరోపించినట్లుగా క్లబ్‌లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదన్నారు. ఆయన సోదరుడు సురేష్ నాయుడు లాగా అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌తో డ్రామాలు ఆడలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది ఉండేలా ముని సుబ్బారెడ్డి, నాగార్జునరెడ్డి, పి. నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

బోగలగురమ్మ నేత్రదానంతో
ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


గుర్రమ్మ (ఫైల్ ఫొటో)

పట్టణంలోని ప్రశాంతి నగర్‌కి చెందిన బోగల గురమ్మ (80) బుధవారం మరణించడంతో ఆమె కుమారుడు ఉపాధ్యాయులు మహేశ్వర్‌రెడ్డి, కోడలు లక్ష్మీనరసమ్మ నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలు నివాసానికి వెళ్లారు. గురమ్మ పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు మట్టి పాలు కాకుండా నేత్రదానం చేయదలచిన వారు 9866727534 లేదా 7093204537 కు సమాచారం ఇచ్చినట్లు అయితే పార్థివ దేహం వద్దకే వచ్చి కార్నియాలను సేకరించి అంధత్వంతో బాధపడుతున్న అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదిస్తామన్నారు. ఈ బృహత్కార్యాన్ని ప్రతి కుటుంబం ఒక కుటుంబ సంప్రదాయంగా అలవరచుకోవాలన్నారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం కృష్ణారెడ్డి, శ్యామ్ కుమార్ రెడ్డి, బంధువులు, సన్నిహితులు మరియు సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

కర్ణ వెంకటలక్ష్మమ్మ నేత్రదానం

లింగాల : మండల పరిధిలోని కర్ణపాపాయపల్లె గ్రామానికి చెందిన కర్ణ వెంకట లక్ష్మమ్మ (60) మృతి చెందడంతో ఆమె కుమారుడు రాజవర్ధన్ రెడ్డి నిరంజన్ రెడ్డి, కుమార్తె రూపా దేవి, కోడలు శ్రీదేవి, శారదా, శివారెడ్డి, మనవరాలు కలిసి జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజుకు సమాచారం అందించారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి గ్రామానికి వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియ ను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఎవరైనా మరణిస్తే నేత్రదానికి తమకు సమాచారం అందించాలన్నారు.

ఉపకారవేతన సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

12 ఏళ్లుగా ఉన్న ఉపకార వేతన సమస్యను వెంటనే పరిష్కరించాలని పశు వైద్య కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన పశు వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మూడు రోజులుగా సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన బాటను పట్టిన విషయం విధితమే. బుధవారం మూడవరోజు తరగతులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసును కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్‌కు అందించి ఆందోళన బాట చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఎంబిబిఎస్ విద్యార్థుల్లాగానే తమ చదువు కొనసాగుతున్నప్పటికీ ఆర్థిక సహకారంలో ప్రభుత్వం వివక్షను చూపుతోందని వాపోయారు. ఎంబిబిఎస్ విద్యార్థులకు స్టయిఫండ్ రూ.25వేలు ఇస్తున్నారని, తమకు మాత్రం రూ.7 వేలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుర్వేదిక్, హోమియోపతి, బిడిఎస్ విద్యార్థులకు కూడా సముచిత గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపార. అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపకారవేతన సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని విద్యార్థులు కోరారు.


ఎమ్మెల్సీని సన్మానిస్తున్న కరస్పాండెంట్ నారాయణరెడ్డి

సంస్కారం లేని విద్య ప్రమాదకరం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - వేంపల్లె

సంస్కారం లేని విద్య చాలా ప్రమాదకరమని కాబట్టి ప్రతి విద్యార్థీ నైతిక విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గండి రోడ్డులో ఉన్న నారాయణ విద్యా సంస్థల్లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, వ్యక్తిత్వ వికాసకులు షఫీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగారు, వెండి, డబ్బు, భూములు, ఇల్లు, స్థలాలు వీటన్నిటికంటే విద్య విలువైన సంపదని అన్నారు. చదువుతో పాటు సంస్కారం అనేది ముఖ్యం అన్నారు. మానవ జీవితంలో విద్యార్థి దశ స్వర్ణ యుగమని దానిని సద్వినియోగం చేసుకుంటే విజేతలు అవుతారని చెప్పారు. నారాయణ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం సంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నారాయణ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పొన్నతోట గంగాధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు, వినయ్ ,టిడిపి నాయకులు జివి రమణ, మైసూరారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


బహుమతులు అందిస్తున్న డాక్టర్ శరణ్య

మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని డాక్టర్ శరణ్య అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శరణ్య (గైనకాలజిస్ట్) మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై విద్యార్థినులతో చర్చించారు. రక్తహీనత, రుతు సమస్యలపై అవగాహన కల్పించారు. మహిళలు ప్రస్తుతం కుటుంబ నిర్వహణలో తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. ఎప్పటికప్పుడూ జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాల సమయంలో విద్యార్థినులకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైనప్పుడు కళాశాల ఉమెన్ సెల్ ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకొని డాక్టర్‌ను సంప్రదించాలన్నారు కార్యక్రమంలో కళాశాల పిఆర్ఒ డాక్టర్ సి. బాల నారాయణ, ఉమెన్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్. కె.విజయలక్ష్మి, రాధిక, రమీజా, హేమావతి, లిఖిత, వాణి, ఆనంద రావు, ప్రశాంతి, సువర్ణ, శిరీష, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.